క్లుప్తంగా

సూర్యాపేటకు తరలిన నాయకులు



మహబూబ్‌నగర్ రూరల్: టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు, రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు సంయుక్త ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లాలో నిర్వహించిన సమావేశానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ నుంచి నాయకులు తరలివెళ్లారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండి బాలరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగయ్య, జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు భీమ్‌రాజ్, బాలరాజు, రాజు, శ్యామ్, నర్సిములు, ఆశన్న, రాజు, మల్లేష్ తదితరులు ఉన్నారు.

జడ్చర్ల టౌన్: సూర్యాపేటలో జరిగిన టీఎమ్మార్పీఎస్ రాష్ట్రస్థాయి సమావేశాలకు మంగళవారం జడ్చర్ల నాయకులు బయలుదేరి వెళ్లారు. అంబేడ్కర్ చౌరస్తాలో కొద్దిసేపు నినాదాలు చేశారు.

బెల్టు దుకాణాల్లో తనిఖీ : నలుగురిపై కేసునమోదు

మహమ్మదాబాద్: గ్రామాల్లో బెల్టు దుకాణాల్లో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసునమోదు చేశారు. వారి కథనం ప్రకారం.. గండేడ్ మండల పరిధిలోని కొంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దుకాణాల్లో మంగళవారం తనిఖీలు చేపట్టారు. కాగా ఇద్దరు వ్యక్తులు మద్యం అమ్ముతూ పట్టుబడ్డారు. ఈ మేరకు వారిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

నవాబుపేట: మండలంలో పలు గ్రామాల్లోని బెల్టు దుకాణాల్లో మంగళవారం ప్రత్యేక దాడులు నిర్వహించి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయించటం, నిల్వ చేయటం నేరమని పలుమార్లు హెచ్చరించినా వారిలో మార్పు రాకపోవడంతో దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మరికల్‌కు చెందిన రమేష్, శివయ్యలపై కేసులు నమోదు చేశామని ఆయన వివరించారు.

విద్యార్థులకు పాటల పోటీలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రలలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం పాటల, నృత్య పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సునీత, అభినయ, యాదయ్య, ప్రభాకర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హన్వాడ: మండల పరిధిలోని ఇబ్రహీంబాద్ గ్రామశివారులోని వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం హన్వాడ పోలీసులు పట్టుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు.. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న స్వామి, రాజులపై కేసునమోదు చేసి ఇసుక ట్రాక్టర్‌లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు సన్మానం



జడ్చర్ల టౌన్: హైదరాబాద్ నుంచి అలంపూర్ వెళ్తూ మంగళవారం సాయంత్రం జాతీయరహదారిపై జడ్చర్ల వద్ద ఆగిన బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు నాయకులు ఘన స్వాగతం పలికారు. బీఆర్‌ఎస్‌లో చేరిన తరువాత మొదటిసారి జిల్లాకు వచ్చిన ఆయనకు మున్సిపల్ కౌన్సిలర్ ఆలూరి శశికిరణ్, ముడా డైరెక్టర్లు శ్రీకాంత్, ఇంతియాజ్ తదితరులు పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు. అనంతరం కొద్దిసేపు ఆగిన ఆయన పార్టీ కార్యకలాపాల గురించి నాయకులతో మాట్లాడి వెళ్లిపోయారు.

హనుమాన్ దీక్ష స్వీకరణ



నారాయణపేట రూరల్: హనుమాన్ దీక్షలతో మోక్షానికి మార్గం లభిస్తుందని గురుస్వామి శరణప్ప అన్నారు. పట్టణంలోని సాయివిజయ కాలనీలోని తొట్ల ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ దీక్షాదారులకు మాలలు వేసి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, అర్చన, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. 21రోజులపాటు దీక్షలు చేసి ఈ నెల 28న దీక్షా విరమణ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో అఖిల్, మల్లేష్; బాలు, అశోక్ పాల్గొన్నారు.

బిల్లులు అందక అవస్థలు



రాయపల్లిలోని కేంద్రంలో పాలు పోస్తున్న పాడిరైతు



జడ్చర్లలోని బీఎంసీయూ పాల కేంద్రం

- పాడిరైతులకు తప్పని తిప్పలు
- మూడన్నరేళ్లుగా ప్రోత్సాహకమూ కరువే

రాజాపూర్: మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన పాడిరైతులు తమకు రావాల్సిన పాల బిల్లులు సరిగా అందకపోతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నెలలో రెండు పర్యాయాలు రావాల్సిన బిల్లులు సమయానికి అందకపోవడం వారిని కష్టాలపాలు చేస్తోంది. మండల పరిధిలోని పలుగ్రామాలకు చెందిన రైతులు వ్యవసాయం చేస్తే పంటదిగుబడి సక్రమంగా రాకపోతుండడంతో పాడిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. వీరితో పాటు మిడ్జిల్, బాలానగర్, జడ్చర్ల మండలాల్లోని గ్రామాలకు చెందిన పాడి రైతులు సైతం విజయడైరీ ఆధీనంలో నడుస్తున్న ఐకేపీ సెంటర్‌కు పాలను పోసి ఉపాధి పొందుతున్నారు.

కాగా వారికి ఫ్యాట్ ఎస్‌ఎన్‌ఎఫ్ ద్వారా ఆవుపాలకు లీటరుకు రూ. 40 నుంచి రూ.46, గేదె పాలకు రూ. 40 నుంచి రూ. 80 వరకు ఇస్తారు. కాగా కొన్ని నెలలుగా రైతులకు సకాలంలో బిల్లులు అందడం లేదు. దీంతో ప్రభుత్వ డైరీ అని నమ్మి పాలుపోస్తే బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి పాడిరైతులకు ప్రోత్సాహకంగా లీటరుకు రూ. 4 చొప్పున ప్రోత్సాహకం ఇస్తే.. 2021 జనవరి నుంచి ఇప్పటి వరకు ప్రోత్సహకం ఊసే లేకుండా పోయిందని చెబుతున్నారు. దాదాపు రూ. 1,84.57, 500 రావాల్సి ఉందని వాపోతున్నారు.

అప్పట్లో డైరీల ద్వారా పాడిరైతులకు బ్యాంకు లింకేజీల సాయంతో పాడి ఆవులు, గేదెలు కూడా ఇచ్చేవారని.. కానీ ప్రస్తుతం ఎలాంటి ప్రోత్సాహం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ప్రభుత్వాలు తమను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సకాలంలో ఇవ్వడం లేదు



వ్యవసాయం సరిగా సాగకపోతుండడంతో అప్పులు చేసి నాలుగు ఆవులు కొనుగోలు చేశాం. కొన్నేళ్లుగా పాడినే నమ్ముకుని జీవిస్తున్నాం. కానీ పాలు పోసినప్పటికీ బిల్లులు సకాలంలో ఇవ్వడం లేదు. పశువులకు దానా కొనేందుకు కూడా అప్పు చేయాల్సి వస్తోంది. ఎకాలంలో అందిస్తే బాగుంటుంది.

– నరిగె మంజుల, పాడిరైతు, రాయపల్లి

అధికారులకు చెబుతూనే ఉన్నాం



రైతులకు పాలబిల్లులపై మేం ఏమీ చెప్పలేకపోతున్నాం. పాల కేంద్రానికి వచ్చి ధర్నాలు కూడా చేశారు. సకాలంలో బిల్లులు వేసేలా ఉన్నతాధికారులకు చెబుతూనే ఉన్నాం. కాని ఇబ్బందులు తప్పడంలేదు. ప్రభుత్వం స్పందించి పాడి రైతుల సమస్యల్ని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– వెంకట్‌రెడ్డి, బీఎంసీయూ డైరీ మేనేజర్, జడ్చర్ల

పట్టా భూములకు సీలింగ్ తొలగించాలి



వినతిపత్రం ఇస్తున్న రైతులు

మహమ్మదాబాద్: తమ పట్టా భూములకు సీలింగ్ తొలగించాలని.. ధరణిపోర్టల్‌తో సీలింగ్ భూములుగా చూయిస్తుండడంతో నష్టపోతున్నామని మహమ్మదాబాద్ మండల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తహసీల్దార్ తిరుపతయ్యకు మంగళవారం వినతిపత్రం అందించారు. మండల కేంద్రంలోని మల్కచెరువు సమీపంలోని శేరిలో కొన్ని సర్వేనంబర్లలో దాదాపు 50 ఎకరాలకు పైగా కొంత మంది రైతుల భూములు సీలింగ్ పట్టాలుగా వచ్చాయని తెలిపారు. దీంతో రైతులు తమ భూములను అవసరాలకు అమ్ముకోవడానికి గానీ.. కొనడానికి గానీ హక్కులు లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నామని వివరించారు. సమస్య పరిష్కరించాలని కోరారు. రైతులు సత్యయ్య, నర్సిములు, పెంటయ్య కిష్టయ్య తదితరులు ఉన్నారు.

సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తాం



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఆరెకటిక సంఘం నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఆరెకటికల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర ఆరెకటికల సంఘం అధ్యక్షుడు అశోక్ కుమార్ ఆధ్వర్యంలో సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఆర్థికంగా వెనుకబడిన ఆరెకటికలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి సబ్సిడీ ద్వారా రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. వారి సమస్యను విన్న ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. వీలైనంత త్వరగా సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. సంక్షేమమే ధ్యేయంగా తాము పని చేస్తున్నామని వివరించారు. సుధాకర్‌రెడ్డి, మల్లేశం, ఖాజారాం, శివరాములు, మహేందర్‌జీ, వెంకటేశ్వర్‌జీ, రవి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబాన్ని ఆదుకుంటాం

విధినిర్వహణలో మరణించిన పదో బెటాలియన్ హోంగార్డు ధన్‌రాజ్‌రాథోడ్ కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. క్యాంపు కార్యాలయంలో గోర్‌సేన జిల్లా అధ్యక్షుడు ఛత్రపతినాయక్ హోంగార్డు ధన్‌రాజ్ కుటుంబస్థితిని ఆయన దృష్టికి తీసుకురాగా స్పందించారు. హోంగార్డు భార్యకు ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగం కల్పిస్తామని, పిల్లల చదువుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు.

మైసమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే దంపతులు

ఫతేపూర్ మైసమ్మ ఆలయంలో మంగళవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఎమ్మెల్యే దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద ఆశీర్వాదం ఇచ్చి అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కృష్ణయ్య, ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్‌యాదవ్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు ప్రాధాన్యతపై అవగాహన



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈమేరకు విద్యార్థులను ఆరు గ్రూపులుగా విభజించి క్విజ్ పోటీలను నిర్వహించి, ఓటు ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో మెరాజుల్లాఖాన్, లియాఖత్‌ఆలీ, రామకృష్ణారావు, సత్యనారాయణ, లక్ష్మణ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ ప్రారంభం

బాలానగర్: మండల పరిధిలో పలు గ్రామాల్లో మంగళవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులలో సోషల్ ఆడిట్ ప్రారంభమైంది. మొత్తం 19 గ్రామాల్లో ఓ విడతలో మరో 18 గ్రామాల్లో రెండో విడతలో ఆడిట్ నిర్వహించనున్నారు. ఈమేరకు 25న ఫైనల్ ఆడిట్ నివేదించనున్నట్లు సమాచారం. ఐదు రోజులపాటు గ్రామాల్లో ఆడిట్ అనంతరం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఫైనల్ ఆడిట్ ఉంటుందని ఏపీఓ రాజశేఖర్ తెలిపారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠాపనోత్సవాలు

అడ్డాకుల: మండలంలోని కందూర్ గ్రామంలో పునర్నిర్మాణం చేపట్టిన జములమ్మ ఆలయం వద్ద విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఆలయం వద్ద పండితులు వేద స్వస్తి, గవ్యాంత పూజలు, వాస్తుపూజ, వాస్తుహోమం, వాస్తుబలి, సాయంత్రం ధాన్యాధివాసం, శాంతి కుంభ స్థాపన, మండపార్చన, శాంతిహోమం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. బీజేపీ జిల్లా నాయకుడు మున్నూర్ రమేష్ భక్తులకు అన్నదానం చేశారు.

బీమాతో జీవితానికి ధీమా



జడ్చర్ల టౌన్: బీమా పాలసీ చేయటం వల్ల కుటుంబానికి ఆర్థికపరమైన భరోసా ఉంటుందని జడ్చర్ల ఎస్‌ఐ చంద్రమౌళి అన్నారు. ఫుట్‌వేర్ దుకాణంలో పనిచేసే మహేష్ ప్రైవేట్ బీమా పాలసీ తీసుకుని నెల రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందగా సదరు కంపెనీ నుంచి రూ.6.80 లక్షలు మంజూరైనట్లు వివరించారు. సదరు చెక్కును మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కంపెనీ అధికారులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల్లో కుమ్మరులకు ప్రాధాన్యత ఇవ్వాలని బీసీ చైతన్య వేదిక నాయకులు శివన్న, బాలచందర్‌లు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. అదేవిధంగా కుమ్మర కులస్తులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.

నిబంధనలు పాటించాలి



నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగలక్ష్మి



ఉడిత్యాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శరత్‌చంద్ర బాబు

గండేడ్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అన్ని రాజకీయపార్టీల వారు నిబంధనలను తప్పక పాటించి సహకరించాలని గండేడ్ తహసీల్దార్ నాగలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం తమ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగిసే వరకు నియమాలను పాటించాల్సిందేనన్నారు. గోడలపై రాతలు రాయకూడదన్నారు. గ్రామాల్లో ఉన్న వివిధ రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలు కనిపించకుండా దస్తులతో చుట్టి పెట్టాలన్నారు. ప్రలోభాలకు గురిచేసే విధంగా వ్యవహరించరాదని ఆమె పేర్కొన్నారు. డబ్బులు పంపిణీ, మద్యం పంచడం చేయరాదన్నారు. ఇళ్ల పై, ప్రభుత్వ స్థలాల్లో జెండాలు పాతడం వంటివి చేయరాదన్నారు. సభలు, సమావేశాలు అనుమతులు లేకుండా నిర్వహించరాదన్నారు. కోడ్ అమలులో ఉన్న కారణంగా ధర్నాలు, ఆందోళనలు చేయడానికి వీలు లేదన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే సివిలైజ్ యాప్‌లో నేరుగా ఎన్నికల కమిషన్‌కు ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఈ మేరకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జితేందర్‌రెడ్డి, పుల్లారెడ్డి, ప్రభు నాయక్, ఎంపీటీసీ బాలయ్య, డీటీ కిషోర్, సీనియర్ అసిస్టెంట్ చైతన్య, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

బాలానగర్: మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎంపీడీఓ శరత్‌చంద్ర బాబు పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అవసరమైన సౌకర్యాల కల్పనకు ఇప్పటి నుంచే చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఉన్నత అధికారులకు ఈ మేరకు నివేదించనున్నట్లు తెలిపారు. కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను బతికించుకోవాలి



మహమ్మదాబాద్‌లో నర్సరీలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ దేవన్న

మహమ్మదాబాద్: వేసవికాలంలో నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను బతికించుకోవాలని గండేడ్ ఎంపీడీఓ దేవన్న తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని దేశాయిపల్లి, చిన్నాయపల్లి, మహమ్మదాబాద్ గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వర్షాకాలం సీజన్‌లో మొక్కలు నాటేందుకు ఇప్పటికే నర్సరీల్లో మొక్కలు పెంచుతున్న కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. అలాగే అన్ని గ్రామాల్లో కూలీలకు తగిన పని చేయించాల్సిన బాధ్యతత ఆయా గ్రామాల కార్యదర్శులు ఎఫ్‌ఏలు తీసుకోవాలని తెలిపారు. ఈయన వెంట ఏపీఓ హరిచ్ంద్రుడు టీఏలు ఉన్నారు.

జోరుగా 'ఉపాధి' పనులు



మల్లెల పాపయ్య కుంటలో ఉపాధి పనులు

దేవరకద్ర: మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న మల్లెల పాపయ్య కుంటలో జోరుగా ఉపాధి పనులు కొనసాగుతున్నాయి. గత అయిదు వారాలుగా ఉపాధి హామీ పథకం కింద కుంటలో పూడిక తీసే పనులు చేపట్టారు. పుడిక తీసిన మట్టిని కట్ట బలోపేతం చేయడానికి వేస్తున్నారు. అయితే కొందరు రైతులు ఒండ్రుమట్టిని పొలాలకు తీసుకుపోతున్నారు. మంగళవారం పనులు జరుగుతుండగా టెక్నికల్ అసిస్టెంట్ లక్ష్మీ, ఫీల్డ్ అసిస్టెంట్ వీరాంజనేయులు తదితరులు పరిశీలించారు.

కనులపండువగా రాములోరి కల్యాణం



సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పండితులు

ఎర్రవల్లిచౌరస్తా: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో మంగళవారం సీతారాముల కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భువనచంద్ర, దత్తుస్వాముల ఆధ్వర్యంలో సీతారాముల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల మధ్య కల్యాణం జరిపించారు. సీతారాముల కల్యాణ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. పాలకమండలి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించినట్లు ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు తెలిపారు.

పెద్ద చెరువు నీటిపై వివాదం

- పొలాలకు వదలాలని కొందరు పశువులకు కావాలని మరికొందరు
- తహసీల్దార్‌కు ఫిర్యాదు



చెరువు కింద సాగు చేసిన వరి పంట

నవాబుపేట: యన్మన్‌గండ్ల, నవాబుపేట జంట గ్రామాల పెద్ద చెరువు నీటిపై వివాదం తలెత్తింది. చెరువు కింద వేసిన పంటలకు నీరు అందించాలని ఆయకట్టు రైతులు విజ్ఞప్తి చేస్తుండగా... అసలే వేసవి ఉందని చెరువులో ఉన్న చాలీచాలని నీరు పశువులు తాగేందుకు ఉంచాలని మరికొందరు పట్టుబడుతున్నారు. ఇప్పటికే పంటలకు నీరు వదలొద్దంటూ కొందరు రైతులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా.. మరికొందరు పశువులకు ఉంచాలని తహసీల్దార్‌కు విన్నవించారు. తాజాగా నవాబుపేటకు చెందిన చెరువు ఆయకట్టు రైతు తిరుపతయ్య తన పంటకు నీరు కావాలని.. ఎండిపోతోందని తహసీల్దార్‌కు మొర పెట్టుకున్నాడు. మరోవైపు చెరువులో చేపలు వదిలిన మత్స్యకారులు నీటిని పంటపొలాలకు వదలవద్దని తహసీల్దార్‌కు వివరించారు. గతంలో చెరువు తెగి చేపలు పోయాయని.. రూ. లక్షల్లో నష్టం వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా ఇటీవల పంటలకు వెళ్తున్న నీటిని మట్టికట్ట వేసి అడ్డుకున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఎవరికీ అన్యాయం జరగకుండా.. పూర్తి విచారణ జరిపి న్యాయం చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. కాగా విషయంపై తహసీల్దార్ నాన్యనాయక్‌ను సంప్రదించగా నీటి పంచాయతీపై సంబంధిత ఇరిగేషన్ అధికారులకు వివరించి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. అందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.



నవాబుపేట చెరువులో తగ్గిన నీరు

బాధిత కుటుంబానికి తోడ్పాటు

బాలానగర్: మండలంలోని పరమేశ్వర పొదుపు సంఘం సభ్యులు సందుల అంజమ్మ ఇటీవల మృతి చెందారు. కాగా సంఘం తరపున బాధిత కుటుంబానికి రూ. 10వేలు మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. సంఘంలో సభ్యత్వం ఉన్నందున సాయం అందించినట్లు అధ్యక్షుడు తిరుపతయ్య తెలిపారు. ఉపాధ్యక్షుడు బాల్ చెన్నయ్య, లింగంపాటు సభ్యులు తదితరులు ఉన్నారు.